నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, సోమవారం 2 డిసెంబర్ 2024 | RANGAREDDY


## వర్ష సూచన



సిటీబ్యూరో: బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావంతో ఆదివారం గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. సికింద్రాబాద్ అడ్డగుట్ట, మల్కాజిగిరి, హయత్‌నగర్, ఉప్పల్, నాగోల్, బంజారాహిల్స్, రాజేంద్రనగర్, హిమాయత్‌నగర్ తదితర ప్రాంతాల్లో 5 మి.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. తుఫాను ప్రభావంతో రాగల మరో రెండు రోజులు నగరంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వాన కురిసే అవకాశమున్నట్లు అధికారులు వెల్లడించారు.

*భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆదివారం మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ కవిత సూచించారు.*

*- కడ్తాల్, డిసెంబర్ 1*



# ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థులు బలి



అత్తాపూర్ బీసీ హాస్టల్‌లో విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటున్న టీఎస్‌ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్

- **నాణ్యమైన భోజనం అందించకుంటే ఆందోళన చేస్తాం**
- **టీఎస్‌ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్**

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 1 : రాష్ట్రంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని టీఎస్‌ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ అన్నారు. ఆదివారం అత్తాపూర్ బీసీ హాస్టల్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. అత్తాపూర్ బీసీ హాస్టల్‌లో నాణ్యమైన భోజనం లభించడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. గడిచిన వారం రోజుల నుంచి గురుకులాల్లో మధ్యాహ్న భోజనంతో చాలామంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్నారు. రెండు రోజుల క్రితం జమ్మికుంట కస్తూర్బా పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న నిత్యశ్రీ అనే విద్యార్థిని పాఠశాల నిర్లక్ష్యంతోనే మరణించిందన్నారు. నాణ్యమైన భోజనం అందించడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వంపై హైకోర్టు మొట్టికాయలు వేసినా మార్పు రావడం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు ఎక్కువ శాతం దళితులు, గిరిజనులు, బీసీలు ఉంటారని.. ప్రభుత్వంపై నమ్మకంతో విద్యార్థులను పాఠశాలల్లో చేర్పిస్తే ఇలా చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. మధ్యాహ్న భోజనం సరిగ్గా లేదని ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలపై నివేదిక తీసుకొని వెంటనే నాణ్యమైన భోజనాన్ని అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌ఎస్‌వో రాజేంద్రనగర్ మండల అధ్యక్షుడు సంతోశ్, నాయకులు వంశీకృష్ణ, సాయికిరణ్‌గౌడ్, నికిత్‌కుమార్, శ్రీకాంత్, శివప్రసాద్‌నాయుడు, వినోద్, రామాంజనేయులు, ఆనంద్‌కుమార్, ఉపేందర్, శివరాజ్, వినయ్‌కుమార్, అఖిల్, హర్ష శివరాం, అన్వేశ్, అభిరామ్, రాజు, చంద్రశేఖర్, మల్లేశ్, గణేశ్, సాయికుమార్, వీర, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

*12 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గురుకులాలు తమ ప్రభను కోల్పోతున్నాయి. సరిపడా వసతుల్లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే సదుద్దేశంతో గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి.. అవసరమైన నిధులను విడుదల చేసి, వాటి అభ్యున్నతికి కృషి చేస్తే.. ప్రస్తుత రేవంత్ సర్కార్‌లో వాటి మనుగడే ప్రశ్నార్థకంగా మారిందని.. ఇందుకు రాష్ట్రంలోని గురుకులాల్లో జరుగుతున్న ఘటనలే నిదర్శనమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.*

*- రంగారెడ్డి, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ)*



విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బృందం సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు

# గురుకులాల నిండా సమస్యలే..

- సంక్షేమ వసతి గృహాల్లో దయనీయ పరిస్థితి
- మరుగుదొడ్లు, మూత్రశాలలూ సరిగ్గాలేవ్..
- విద్యార్థులు పురుగులన్నం తినలేకపోతున్నారు..
- కుళ్లిన కూరగాయలు..నాసిరకం భోజనం.. రోగాలబారిన స్టూడెంట్స్
- ప్రభుత్వ నిర్లక్ష్యం, కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- రంగారెడ్డి జిల్లాలోని హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం మండలాల్లోని పలు గురుకుల పాఠశాలల సందర్శన

బీఆర్ఎస్వీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం ప్రవీణ్‌కుమార్ బృందం హ యత్‌నగర్, ఇబ్రహీంపట్నం మండలాల్లోని పలు రెసిడెన్షియల్ హాస్టళ్లను సందర్శించింది. విద్యార్థులకు అందుతున్న భోజనం, అక్కడి వసతులు, సౌకర్యాలను చూసి ఆవేదన వ్యక్తం చేసింది. విద్యార్థులు తమ సమస్యలను వారికి వివరించారు. పురుగుల అన్నం తినలేకపోతున్నామని, సబ్బులు, షాంపూలు ఇవ్వడంలేదని, సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి అరకొరగా వస్తున్న నిధులతో కుళ్లిన కూరగాయలతో తమకు నాసిరకం భోజనం పెడుతున్నారని.. ఆ అన్నం తిని రోగాల బారిన పడుతున్నాయని బోరున విలపించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. రేవంత్ సర్కారు వచ్చినప్పటి నుంచి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని.. కనీసం వారికి నాణ్యమైన భోజనం అందించలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉన్నదని మండిపడ్డారు. విద్యారంగంపై ప్రభుత్వానికి శ్రద్ధ లేకపోవడం.. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉన్నదన్నారు. రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను బీఆర్ఎస్ పార్టీ ఎక్కడికక్కడ వెలుగులోకి తీసుకొస్తుంటే..సీఎం రేవంత్ మాత్రం మంత్రులతో అసత్య ఆరోపణలు చేయిస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. హాస్టళ్ల సమస్యలను రాజకీయ కోణంలో చూడొద్దని.. సమస్య మూలాలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలన్నారు. గురుకులాల్లో లెక్చరర్లు సరిగ్గా లేరని అనేక చోట్ల భవనాలే లేవని.. మరుగుదొడ్లు, మూత్రశాలల్లేక విద్యార్థులు సతమతమవుతున్నారన్నారు. బెడ్లు, దుప్పట్లు కూడా ఇవ్వడంలేదన్నారు. నేటికీ స్పోర్ట్స్ మెటీరియల్ లేక విద్యార్థులు క్రీడల్లో వెనుకబడిపోయారన్నారు. హయత్‌నగర్‌లోని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, శేరిగూడలోని రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, ఇబ్రహీంపట్నం నల్లకంచలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలను ఆ బృందం పరిశీలించింది. కార్యక్రమంలో గెల్లు శ్రీనివాస్, ఎర్రోళ్ల శ్రీనివాస్, వాసుదేవరెడ్డి, ఆంజనేయులు, మున్సిపల్ మాజీ చైర్మన్ భరత్‌కుమార్, మాజీ ఎంపీపీ కృపేశ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్, రాజు, అరవింద్, ప్రవీణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



కస్తూర్బా గాంధీ పాఠశాలలో పారుతున్న మురుగును పరిశీలిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బృందం

# కలవరపెడుతున్న కల్తీ..!

## ధనార్జనే ధ్యేయంగా హోటళ్ల నిర్వాహకుల బిజినెస్

- తనిఖీల్లో విస్తుపోయే నిజాలు
- బల్దియాకు ఫిర్యాదుల వెల్లువ
- 9,886 హోటళ్లలో తనిఖీలు
- 1588 నోటీసులు, జరిమానాలు



సిటీబ్యూరో, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ ) : కల్తీ వ్యవహారం గ్రేటర్‌ను కుదిపేస్తున్నది. చిన్న హోటళ్లే కాదు పేరొందిన రెస్టారెంట్లలోనూ భయానక వాస్తవాలు రోజుకో చోట బయటపడుతున్నాయి. నియమ, నిబంధనలను పక్కన పెట్టేసి ధనార్జనే ధ్యేయంగా హోటళ్లు, రెస్టారెంట్లు నిర్వాహకులు వ్యాపారాన్ని సాగిస్తున్నారు. వంట గదులు పరిశుభ్రత పాటించడం లేదు..ఫుడ్ తయారీలో ప్రతిదీ కల్తీ వస్తువులను ప్రోత్సహిస్తున్నారు. పైగా పాచిపోయిన ఆహారాన్ని ఫ్రిజ్‌లో పెట్టి తిరిగి వేడి చేసి పెడుతున్నారు. మాంసం అయితే రోజుల తరబడి ఫ్రిజ్‌లో పెట్టి దానికి మసాలాలు దట్టించి మరుసటి రోజు వాడుతున్నారు. బిర్యానీలో బొద్దింకలు, వెంట్రుకలు వస్తున్న సందర్భాలూ లేకపోలేదు.. ఈ జాబితాలో చిన్న హోటళ్ల నుంచి బడా హోటళ్లు ఉంటున్నాయి. తరచూ జీహెచ్ఎంసీకి నిత్యం దాదాపు 20 వరకు పైగా ఫిర్యాదులు ఇలాంటివే ఎక్కువగా వస్తున్నాయి. ఇందులో భాగంగానే గడిచిన కొన్ని నెలలుగా ఫుడ్ సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ బృందాలు ఫుడ్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లపై విస్తృత తనిఖీల్లో ఆహార కల్తీకి అడ్డూ అదుపు లేకుండా పోతున్నదని, ఏ మాత్రం శుభ్రత, నాణ్యత లేమి బయటపడుతున్నాయి. గడిచిన పది నెలల వ్యవధిలో 9,886 హోటళ్లలో తనిఖీలు చేయగా, 1588కి అధికారులు నోటీసులు జారీ చేశారు. 68 హోటళ్లు ప్రమాదకరం, 12 తీవ్ర హానికరమని తేల్చారు. ఆహార పదార్థాల్లో కల్తీ కేది కాదు అనర్హం అన్న చందంగా ఈ తనిఖీలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా భారీ పెనాల్టీలు, మూసివేతలు, తగిన శిక్షలు అమలు కాకపోవడం ఓ కారణం కాగా, లంచాలకు మరిగిన అధికారులపై చర్యలు లేకపోవడంతో మరో కారణంగా కనిపిస్తున్నది.

### పట్టని నిబంధనలు

కోటికి పైగా జనాభా కలిగిన గ్రేటర్‌లో దాదాపు 12 నుంచి 14 వేల వరకు హోటళ్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయిల్ నుంచి మొదలు ఉప్పు దాకా నాణ్యమైన వాటిని వినియోగించి నిర్వాహకులు క్వాలిటీ ఫుడ్‌ను అందించాలి. జీహెచ్ఎంసీ స్టాంప్ వేసిన మాంసాన్ని వాడాలి. హోటళ్లు, హాస్టల్స్, క్యాంటీన్లు, బార్ అండ్ రెస్టారెంట్లు, చైనీస్ ఫుడ్ సెంటర్లు..ఫుడ్ వ్యాపారం ఏదైనా.. నిర్వాహకులు వంటగది లోపలి భాగం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి. డ్రైనేజీ వసతి బాగుండాలి. వంట వండే వ్యక్తి, వడ్డించే వ్యక్తులకు సంబంధిత హోటల్ యజమాని డాక్టర్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకోవాలి. ఇవి చాలా చోట్ల అమలు కావడం లేదు.

### అమలు కానీ కఠిన శిక్షలు

పరిరక్షణ లేని ఆహారాన్ని ఎవరు తయారు చేసినా, అమ్మినా, నిల్వ చేసినా, సరఫరా చేసినా ఫుడ్ సెఫ్టీ స్టాండర్డ్ యాక్ట్ 2006 చట్టం ద్వారా శిక్షతో పాటు జరిమానా విధిస్తారు. అనుమతి లేకుండా విక్రయిస్తే ఆరు నెలల జైలు, రూ. లక్ష వరకు జరిమానా వేస్తారు. ఆరోగ్యానికి హానికరంగా ఉంటే ఏడాది జైలు శిక్ష, రూ. 3 లక్షల వరకు పెనాల్టీ ఉంటుంది. తీవ్ర అనారోగ్యానికి గురి చేసే ఆహార పదార్థమైతే ఆరు నెలల జైలు శిక్ష, రూ. 5లక్షల వరకు జరిమానా వేస్తారు. మృతికి కల్తీ ఆహారం కారణమైతే జీవితఖైదు, రూ. 10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశాలున్నాయి.

**గడిచిన పది నెలలలో జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ వివరాలు**

| | |
|---|---|
| నిర్వహించిన తనిఖీలు | 9,886 |
| జారీ చేసిన నోటీసులు | 1,588 |
| సేకరించిన శాంపిల్స్ | 1,797 |
| శాంపిల్స్ మేరకు ఉల్లంఘనులు | 68 |
| సురక్షితం కానివి | 12 |

### సర్వం కల్తీమయం

- ఆహార పదార్థాల్లో ప్రకృతి సిద్ధమైన రంగులే వాడాలి.
- ఆహార పదార్థాల తయారీకి టేస్టింగ్ సాల్ట్ (చైనా సాల్ట్) వాడకూడదు. రోజు వారీగా వాడే ఉప్పునే ఉపయోగించాలి. కానీ ఈ నిబంధనలను చాలా మంది బిర్యానీ సెంటర్ల నిర్వాహకులు పాటించడం లేదు.
- పాలల్లో చిక్కదనం కోసం నాసిరకం పాల పౌడర్లు, యూరియా, పిండి, నూనె, నీళ్లు కలిపి విక్రయిస్తున్నారు.
- రంపపు పొట్టును టీ పొడిలో కలపడం వల్ల ఊపిరితిత్తులు పాడైపోయే ప్రమాదం ఉంది.
- జంతువులు కళేబరాల నుంచి సేకరించిన ఎముకలను బట్టీల్లో అత్యధిక ఉష్ణోగ్రతపై మరిగించి తీసిన ద్రావణాన్ని వంట నూనెల్లో కలిపి విక్రయిస్తున్నారు. దీంతో జీర్ణకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది.
- ఆరోగ్యకరమైన జంతువు మాంసాన్ని 24 గంటల్లోపే వినియోగించాలి. చాలా హోటళ్లలో చనిపోయిన జంతువుల మాంసాన్ని ఎక్కువ కాలం నిల్వ ఉంచిన మాంసాన్ని విక్రయిస్తున్నారు.
- చికెన్, మటన్ బిర్యానీలు, తందూరీ చికెన్‌లలో కస్టమర్లను ఆకట్టుకునేందుకు ఎక్కువగా హానికర రంగులు వాడుతున్నారు.
- చిన్న, చిన్న హోటళ్లు, కర్రీపాయింట్లలో వేడి వేడి కూరలు, పప్పు, సాంబారు వంటి ఆహార పదార్థాలు పల్చటి పాలిథిన్ కవర్లలో వేసి ఇస్తున్నారు. పదార్థాల వేడికి ప్లాస్టిక్ కరిగిపోయి తిన్న తర్వాత అనారోగ్యాన్ని కలిగిస్తాయి.
- అల్లం, వెల్లుల్లి పేస్టులలో ఆరటి గుజ్జు, ఆలుగడ్డ, ఉల్లిగడ్డ పేస్ట్‌ను కలుపుతున్నారు.
- అన్ని రకాల పండ్లను ఆకర్షణీయంగా కనిపించేందుకు కార్బైడ్ హానికారక రంగులు, జిగురు యథేచ్ఛగా వాడుతున్నారు. దీంతో కాలేయ సమస్యలు, కడుపునొప్పి, నిద్రలేమి , కిడ్నీ వంటి అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. కాగా బయటి ఆహారం తినడంతో చాలా రోగాలు వచ్చే అవకాశాలున్నాయని, వీలైనంత వరకు తగ్గించుకోవాలని వైద్యులు చెబుతున్నారు. వాడిన నూనెనే మళ్లీ వాడడం ద్వారా కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు, బరువు పెరగడం , అజీర్ణం, బీపీ, మధుమేహం, శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గిపోవడం, కాలేయ సంబంధిత వ్యాధులు వస్తాయని చెబుతున్నారు.



రోడ్డు పనులు చేయించాలని మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డిని కోరుతున్న పీఏసీఎస్ వైస్ చైర్మన్, మాజీ సర్పంచుల బృందం

## రోడ్లకు మరమ్మతులు చేయించండి

**అధికారులను ఆదేశించిన మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి**

మహేశ్వరం , డిసెంబర్ 1 : అధ్వానంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేయించాలని మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద గోల్కొండ నుంచి కోళ్ల పడకల్ పోయే రెండు లైన్ల రోడ్డుకు మరమ్మతులు చేయించాలని పీఏసీఎస్ వైస్ చైర్మన్ దేవరపల్లి వెంకటేశ్వర రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గాదె థామస్ రెడ్డి, మాజీ సర్పంచులు బండారు లింగం ముదిరాజ్, మంత్రి రాజేశ్, రంగారెడ్డి వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ ఎంఎ సమీర్, రమేశ్, మల్లేశ్, శ్రీకాంత్ తదితరులు ఎమ్మెల్యేను కలిసి విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడారు. రోడ్డు పనులు చేయించాలని ఆదేశించారు. రోడ్లు అస్తవ్యస్తంగా ఉంటే ఎలా ప్రయాణం చేస్తారని అధికారులను ఆమె ప్రశ్నించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని పనులు చేపట్టాలన్నారు.



## కశ్మీర్ ఉత్సవ్ మేళా

నెక్లెస్‌రోడ్ పీపుల్స్‌ప్లాజాలో ఏర్పాటు చేసిన కశ్మీర్ ఉత్సవ్ మేళాలో ఆదివారం సందర్శకులు బారులు తీరారు. యూట్యూబ్ ఫేమ్ కిరాక్ కాలా, ప్రియారెడ్డి, గుల్లు దాదాలతో సందడి చేశారు. –ఖైరతాబాద్